# మాతృభూమి స్వర్గంతో సమానం!

* ఎన్నారైల మాట
* అట్టహాసంగా ఆటా వేడుకలు
* ఆరోగ్య, రక్తదాన శిబిరాలకు విశేష స్పందన
* ఆకట్టుకున్న గవర్నర్ ప్రసంగం
* గవ్వా నోటా.. ఫోర్‌లైన్ మాట
* నడిగూడెంలో గురుకుల పాఠశాలకు శంకుస్థాపన

(న్యూస్‌టుడే-నల్గొండ)

రెండురోజులుగా నిర్వహిస్తున్న ఆటా తృతీయ వేడుకలు ఘనంగా ముగిశాయి. గురువారం నిర్వహించిన సుమారు 2వేల మందితో మహా మెగా శిబిరం.. మహా రక్తదాన శిబిరం విజయవంతమైంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో రక్తాన్ని దానం చేశారు. రాష్ట్ర గవర్నర్, జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, అన్ని రాజకీయ పార్టీల ప్రముఖులు ఆటా వేడుకలకు హాజరయ్యారు. 'ఆటా' ఉద్దేశ్యాలు, కార్యక్రమాలను ప్రవాసాంధ్రులు వివరించారు. తెలుగుగడ్డపై ఉన్న ప్రేమతో.. జన్మ భూమి రుణం తీర్చుకోవడానికి ప్రవాసాంధ్రుల సేవలపై ప్రశంసల జల్లు కురిసింది.

## సూర్యాపేటలో కాంతులు: గవర్నర్

గవర్నర్ ఎన్.డి.తివారీ ప్రసంగం ఆసక్తికరంగా సాగింది. తాను కూర్చొని మాట్లాడుతున్నందుకు సభికులకు క్షమాపణలు కోరారు. క్విట్ ఇండియా ఉద్యమసమయంలో తూటా తగలడంతో నిలబడలేకపోతున్నానని చెప్పుకొచ్చారు. నేను ఆరోగ్యంగా లేని సమయంలో వచ్చి ఆహ్వానించారు. జైపాల్‌రెడ్డి చెబితే వచ్చా.. 'ఆటా' కార్యక్రమాలు చూశాక ఎంతో గర్వంగా, సంతోషంగా ఉంది. పూర్వీకులు సూర్యుని పూజచేయాలని చెప్పే వారు. అమెరికాలో సూర్యుడు కన్పించడు. ఈ రోజుమాత్రం సూర్యాపేటలో సూర్యుని తేజస్సు, రోషిణీ, వేడి, నక్షత్రాలు గుర్తుకు వస్తున్నాయి. అంటూ పేటను సూర్యునితో పోల్చారు.

## ధనవంతులారా.. దానకర్ణులు కండి

గతంలో అమెరికా నుంచి ప్రవాసాంధ్రులు హైదరాబాదు వస్తే.. ఎన్‌ఆర్ఐ వచ్చారని గొప్పగా చెప్పుకునేవారు. ప్రస్తుతం మాత్రం షంషాబాద్ నుంచివచ్చారని మాట్లాడుతున్నారు. డబ్బు ఎంత సంపాదించామని కాదు.. దానగుణం కావాలి. ఎంతసాయం చేశామనేది ముఖ్యం. 'ఉంచుకోవడంలోవస్తుంది ఆయాసం.. ఇచ్చుకోవడంలో ఉంటుంది ఉల్లాసం' అంటూ గవ్వా చంద్రారెడ్డి చెప్పిన మాటలు అందరికి ఆదర్శంగా నిలిచాయి. ప్రవాసాంధ్రులు మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ప్రముఖులు కోరారు. గ్రామాలను దత్తత తీసుకుంటే.. 50-50 శాతం నిధులను ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకొస్తుందని మంత్రులు భరోసా ఇచ్చారు.

## ఫోర్‌లైన్లపై చర్చ..

జాతీయ రహదారిపై చాలా మంది ప్రాణాలు పోతున్నాయి. రెండున్నరేళ్లుగా నిధులు మంజూరయ్యాయి.. పనులు చేస్తామంటున్నారే తప్పా.. ఏం లేదు. కేంద్రమంత్రి నాలుగు లైన్ల రహదారిని త్వరగా చేయించాలని

అటా అధ్యక్షుడు గవ్వా చంద్రారెడ్డి వ్యాఖ్యలు సభలో కలకలం రేపాయి. నాలుగులైన్లు లేకపోవడం వల్ల జరుగుతున్న ప్రమాదాలు, నష్టాన్ని ఆయన కూడా గుర్తుచేయడంతో సమస్య తీవ్రత ఏమిటో అర్థమైంది. నిధులు మంజూరయ్యాయని.. బిడ్లు పిలిచామని కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. 2008లో తప్పక ప్రారంభిస్తామని మరోసారి హామీ ఇచ్చారు.

### ఒకే నిమిషం.. పార్టీకొక్కరే

సమయం మించిపోతోంది. తక్కువ మాట్లాడితే పార్టీకో ప్రతినిధికి మాట్లాడే అవకాశం కల్పిస్తాం. రెండు నిమిషాల్లో ప్రసంగం ముగించాలంటూ హోంమంత్రి జానారెడ్డి వ్యాఖ్యానాలు అందరిలో ఆశ్చర్యాన్ని.. ఒకింత హాస్యాన్ని పంచింది. సభావేదికపై ఉన్న సభ్యుల పేర్లు చెప్పవద్దని.. చివరికి ఒక్క నిమిషానికే కటాఫ్ పెట్టారు. దీంతో అందరూ ఇలా వచ్చి అలా మాట్లాడి వెళ్లిపోయారు. రాజకీయ సభల్లా సుదీర్ఘ ప్రసంగాలు చేయలేదు.

### అలరించిన ఆటా.. పాట

జననీ జన్మభూమిచ్ఛా.. స్వర్గాదపి గరియసి.. ఇది భారతదేశం.. త్యాగధనుల పుణ్యస్థలం.. అంటూ పాటలో అతిథుల పేర్లు వచ్చాయి. పాట, నృత్యం ఆహుతులను అలరించాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను గుర్తుకు తెచ్చే కొమ్ములాట, లంబాడీ నృత్యం, భరతనాట్యం, విద్యార్థుల ఆటలు, పాటలు పండగ వాతావరణాన్ని తలపించాయి. సాయంత్రం జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

---

## మాతృభూమి రుణం తీర్చుకుంటాం...

* భారతీయ సంస్కృతిని ముందుతరాలకు అందించాలి
* 'అటా' తృతీయ వేడుకల్లో అధ్యక్షుడు గవ్వా చంద్రరెడ్డి

(న్యూస్‌టుడే, సూర్యాపేట)

'గ్రామాన్ని సాకుకుందాం.. మాతృభూమి రుణం తీర్చుకుందాం..' అనే నినాదంతో అమెరికా తెలుగు అసోసియేషన్ సభ్యులు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారని ఆ సంఘం అధ్యక్షుడు గవ్వా చంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక క్యాన్సర్ ఆస్పత్రి ఆవరణలో జరిగిన 'మహా ఆరోగ్య శిబిరం-మహా రక్తదాన శిబిరాన్ని' ఉద్దేశించి ఆయన మట్లాడుతూ 3 లక్షల మంది అటాలో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. మాతృభూమిలో సామాజిక కార్యక్రమాలతోపాటు భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను ముందుతరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రతి రెండేళ్లకు ఒకసారి రాష్ట్రంలో అటా వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాతృభూమిని ఆదుకోవాలనే తపనతో అమెరికాలో ఎంతోమందికి ఉందన్నారు. వారందరినీ ఒకతాటిపైకి తీసుకొచ్చి రాష్ట్రంలో మరిన్ని సామాజిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం అభివృద్ధి, ఫ్లోరోసిస్, ఎయిడ్స్ వంటి వ్యాధుల నిర్మూలన కార్యక్రమాలు చేపడతామని.. గ్రామాలను దత్తత తీసుకొని అక్కడ రోడ్లు, పాఠశాలలు నిర్మిస్తామన్నారు. ప్రవాసాంధ్రులే కాకుండా స్థానికంగా ఉన్న ధనికులు కూడా పేద ప్రజల సాయం అందించేందకు కృషి చేయాలని కోరారు. హైదరాబాదు, విజయవాడ మధ్యలోని

తొమ్మిదో నెంబరు జాతీయ రహదారిపై ప్రతి రోజు రోడ్డు ప్రమాదాలతో చాలా మంది మృత్యువాత పడుతున్నారని.. వెంటనే ఫోర్‌వే ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి జైపాల్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ప్రవాసాంధ్రుడు పైల్ల మల్లారెడ్డి మాట్లాడుతు వలిగొండ మండలంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. ప్రతి ఒక్క ఎన్.ఆర్.ఐ. మాతృభూమిలో సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

ఆందోళన కలిగిస్తున్న ఎయిడ్స్: సురవరం నల్గొండ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో, జిల్లాలో ఎయిడ్స్ వాధిగ్రస్తుల సంఖ్య ఆందోళన కలిగిస్తుందని అన్నారు. వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలతోపాటు ప్రవాసాంధ్రులు కృషిచేయాలని కోరారు. సీపీఎం శాసన సభాపక్షం నాయకుడు నోముల నర్సింహయ్య, ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, తెదేపా జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, మున్సిపల్ ఛైర్మన్ మీలా సత్యనారాయణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న అటా సభ్యులను అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అటా సభ్యులు రవిందర్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర హోంమంత్రి జానారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ అభివృద్ధి మండలి ఛైర్మన్ ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి, జిల్లా జడ్పీ ఛైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు చుక్కారామయ్య, చెరుపల్లి సీతారాములు, నేతివిద్యాసాగర్, యాదవరెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, డాక్టర్ నగేష్, జిల్లా కలెక్టర్ ఎం.పురుషోత్తంరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్లు మీలా సత్యనారాయణ, పుల్లెంల వెంకటనారాయణ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు సుంకరి మల్లేష్‌గౌడ్, తెరాస జిల్లా అధ్యక్షుడు బోరవోలు సోమిరెడ్డి, సూర్యాపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ తండు శ్రీనివాస్‌యాదవ్, రాంరెడ్డి కృష్ణారెడ్డి, డాక్టర్ విజయపాల్, డాక్టర్ హరినాధ్, డాక్టర్ వి.ఎన్.రెడ్డి, లక్ష్మణ్‌రావు, నరోత్తంరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, జడ్పిటీసీ సభ్యురాలు పటేల్ లావణ్య, ఎంపీపీ భూక్యా కాంతా పాల్గొన్నారు.

---

## సైడ్ లైట్స్...

(న్యూస్‌టుడే, సూర్యాపేట)

* అటా సభ్యుడు అర్జున్‌రెడ్డి ప్రసంగిస్తూ సూర్యాపేటలో ఇంత గొప్పగా తమకు స్వాగతం లభిస్తుందని తెలిస్తే అమెరికా నుంచి చాలా మంది ఎన్.ఆర్.ఐ.లు కార్యక్రమానికి హాజరయ్యేవారని అనడంతో సభలో నవ్వులు విరిసాయి.

* ఐటీ మంత్రి దామోదర్‌రెడ్డి తన ప్రసంగంలో ఆలేరు ఎమ్మెల్యే నగేష్ పేరును మర్చిపోవడంతో ఆయన సోదరుడు రాంరెడ్డి కృష్ణారెడ్డి గుర్తుచేశారు.

* రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రారంభ ఉపన్యాసం చేస్తుండగానే ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి సభ నుంచి వెళ్లిపోయారు.

* సమయం తక్కువగా ఉన్నందున అందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వనందుకు ఎవ్వరూ తప్పుగా భావించొద్దని సభాధ్యక్షుడు జానారెడ్డి పదేపదే కోరారు.

* మొదట రెండు నిమిషాల్లోనే ప్రసంగాన్ని ముగించాలని చెప్పిన మంత్రి జానారెడ్డి సమయాన్ని నిమిషానికి కుదించారు. తర్వాత కేవలం అటా సభ్యులకు అభినందనలు తెలిపి ముగించాలని సలహా ఇస్తుండటంతో

సభికులు పెద్ద పెట్టున నవ్వారు.
* ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య తన ప్రసంగాన్ని పొడిగిస్తుండగా.. హోంమంత్రి కొద్దిగా అసహనం వ్యక్తం చేశారు. త్వరగా పూర్తిచేయాలంటూ తన చేతిలోని మైక్‌పై శబ్దం చేశారు.
* ఖమ్మం జిల్లా తుమ్మలగూడెం గ్రామం నుంచి హాజరైన కొమ్ముకాయ నృత్యకారులు కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.
* పులిహోర, మంచినీటి ప్యాకెట్ల పంపిణీ సందర్భంగా తోపులాట జరిగింది.

---

## గ్రామాన్ని దత్తత తీసుకొని తీర్చి దిద్దుతా..

పైళ్ల మల్లారెడ్డి (సుంకిశాల) అటా ట్రస్టీ

న్యూస్‌టుడే, మోత్కూరు:

వలిగొండ మండలంలో మా స్వగ్రామం సుంకిశాలలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాను. ఈ అటా సభల స్ఫూర్తితో ఎన్నారైలంతా గ్రామాల దత్తత తీసుకునేందుకు ముందుకురావాలి. మాతృభూమిని అభివృద్ధి చేసుకోవాలి. సూర్యాపేటలో అటా సభలు విజయవంతం కావడం సంతోషంగా ఉంది.

పేద విద్యార్థులను ఆదుకునేందుకే..: చిలువుల రాంచంద్రారెడ్డి, దుప్పల్లి (ఆత్మకూర్(ఎం) మండలం)

ప్రధానంగా విద్యా అవకాశాలు పెంపొందించేందుకు ప్రాధాన్యమిస్తున్నాను. రూ.1.25 కోట్లతో భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, రూ.16 లక్షలతో దుప్పల్లి ఉన్నత పాఠశాలకు భవనాలు నిర్మించి ఇచ్చాను. అనేక మందికి ఉపకార వేతనాలుఇస్తున్నాను. రాంచంద్రారెడ్డి చిలుముల ట్రస్టును ఏర్పాటు చేశాను. తద్వారా రూ.4 కోట్ల మేర ప్రతిభ గల పేద విద్యార్థుల చదువు కోసం ఖర్చు చేసేందుకు నిర్ణయించుకున్నాను. భవిష్యత్తులో ఓ ప్రణాళికతో ముందుకెళుతున్నాను. ఎన్నారైలు తమ, తమ ప్రాంతాల అభివృద్ధికి పాటుపడితే బాగుంటుంది.

స్వగ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టా..: రాజు చింతల, అటా జాయింట్ సెక్రటరీ, టేకుల సోమారం (వలిగొండ మండలం)

మా గ్రామంలో రూ.లక్షతో దేవాలయ అభివృద్ధి చేపట్టాను. గ్రామంలోని పాఠశాల అభివృద్ధి కోసం రూ.లక్ష ఇచ్చాను. అటా సభలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి. గ్రామాన్ని దత్తత తీసుకుంటాను. అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలతోపాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతాను. పేద విద్యార్థులకు ఇంటర్నెట్, కంప్యూటర్ విద్యా సదుపాయాలు కల్పించేందుకు ఓ ప్రణాళికను సిద్ధం చేశాను.

విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాను: విశ్వేశ్వర్ కలవల, పెద్దడ (కరీంనగర్ జిల్లా)

ప్రతిభగల పేద విద్యార్థుల కోసం కెరీర్ గైడ్‌లైన్స్ తయారు చేసి ఉచితంగా అందిస్తున్నాను. కంప్యూటర్ విద్య కోసం సాయం చేస్తున్నాను. పేదలకు ఉచిత కంటి శిబిరాలు నిర్వహిస్తున్నాను. న్యాయవిజ్ఞానాన్ని, జర్నలిజంలో శిక్షణనిచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను. అమెరికాలో విద్యా, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సహకరిస్తున్నాడు. అటా సభలస్ఫూర్తితో గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తాను. కరీంనగర్ జిల్లాలోని ఎన్నారైలందరినీ ఒక్క తాటిపైకి తెచ్చి పెద్ద సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నా.

**తెలుగు సంస్కృతిని పెంపొందిస్తున్నాను: మహేష్ సలాది, అటా కల్చరల్ ఛైర్‌పర్సన్ (విజయవాడ)**

తెలుగు సాహితీ, సాంస్కృతిక, సంప్రదాయాలు ఆచరించేందుకు కృషి చేస్తున్నాను. భరతనాట్యం, కూచిపూడి, సంగీతం, సాహిత్యం ఇక్కడి పండుగల ప్రాముఖ్యం, అక్కడి తెలుగు ప్రజల్లో రంగరించి పోస్తున్నాయి. అమెరికాలో తెలుగు కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తు వారిలో చైతన్యం కల్పిస్తున్నాను. అటా సభల స్ఫూర్తితో ఇక్కడ ఏదైనా గ్రామాన్ని దత్తత తీసుకోవడంలో సహకరిస్తాను.అమెరికాలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నాం.

**ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని కార్యక్రమాలు: ముదుగంటి జితేందర్‌రెడ్డి, అటా ప్రసిడెంట్ ఎలక్ట్, ఎడవల్లి(నిజామాబాద్ జిల్లా)**

ఎన్నారైలు అందించే ఆర్థిక సహాయానికి తోడుగా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్‌ను అందచేస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయి. నిజామాబాద్‌లో పాఠశాల అభివృద్ధికి రూ. 15 లక్షలు వెచ్చిస్తాను. మా గ్రామంలోని పాఠశాలలో వసతులు కల్పించాను. ప్రధానంగా వికలాంగులకు సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తున్నాను. కొంత మంది వికలాంగులకు సాయం అందిస్తున్నాను. వికలాంగుల కోసం వైద్య శిబిరాలు చేపడుతున్నాను. 2010లో జరిగే అటా సభలను నిజామాబాద్‌లో నిర్వహిస్తాను.

**మహిళల్ని మమేకం చేస్తున్నాను: భారతీ పుల్లూరి, అటా ట్రెజరర్, ఇరుకుల్ల గ్రామం (కరీంనగర్ జిల్లా)**

అమెరికాలోని తెలుగు మహిళలను మమేకం చేసి తెలుగు పర్వదినాలు, పండుగలు నిర్వహిస్తున్నాం. తెలుగు వారి కట్టూ, బొట్టూ, అలవాట్లు అమెరికాలో మరిచిపోకుండా చూస్తున్నాను. మన సంస్కృతి సంప్రదాయాలు గొప్పవి. వాటిని నేటి తరం వారు మరిచిపోకుండా ఉండేందుకు కొన్ని కార్యక్రమాలను రూపొందిస్తున్నాం. మాతృభూమిలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాను. అటా సభలు ఎంతో స్ఫూర్తినిచ్చాయి.

**మాతృభూమి రుణం తీర్చుకునేందుకు..: గవ్వ చంద్రారెడ్డి, అటా ప్రసిడెంట్, పిల్లలమర్రి (సూర్యాపేట మండలం)**

అటా సభల స్ఫూర్తితో ఎన్నారైలందరినీ ఒక్కచోటికి చేర్చి మాతృభూమి రుణం తీర్చుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఈ సభలు ఎంతో స్ఫూర్తినిచ్చాయని భావిస్తున్నాం. అటా సభలు విజయవంతం చేయడంలో ఇక్కడి ప్రజలు, ఎన్నారైలు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మంత్రులు ఎంతో తోడ్పడ్డారు. ప్రధానంగా మంత్రి దామోదర్‌రెడ్డి ఎంతో శ్రద్ధ వహించి కార్యక్రమాలు విజయవంతానికి తోడ్పడటం సంతోషంగా ఉంది. ఈసభలు విజయవంతం చేసిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**Courtesy Eenadu**